విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఈవీఎంల తరలింపు ప్రక్రియ కట్టుదిట్టంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: నియోజకవర్గాల వారీగా ఈవియంల తరలింపు ప్రక్రియను అత్యంత కట్టుదిట్టంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆన్లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం నిర్వహించి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పూర్తి చేశారు. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుండి స్థానిక ఈవీఎం గోడౌన్ వద్ద బి.యులు, సియులు, వివిప్యాట్ లను వరుసగా 120, 130 దామాషాగా విభజించినట్టు తెలిపారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బియులు 3,508, సియులు 3,508, వివిప్యాట్లు 3,800 తరలించాల్సి ఉందన్నారు. వీటిని జీపీఎస్ అమర్చిన డిజిటి క్లోజ్డ్ వాహనాలలో పోలీస్ ఎస్కార్ట్ తో పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా వేరు వేరు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలిస్తున్నట్టు తెలిపారు. వీటిని వేరు వేరు స్ట్రాంగ్ రూముల్లో స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు కమిషనింగ్ వరకు భద్రపరిచి సీలు వేయనున్నట్టు తెలిపారు. ఈవీఎంల తరలింపు ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య శనివారం ఉదయం నుండే ఈవీఎం గోడౌన్ దగ్గర ఉండి స్వయంగా పర్యవేక్షిస్తూ అధికారులకు తగు సూచనలను జారీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, రిటర్నింగ్ అధికారులు కె.శ్రీనివాసులురాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, బి.శివ నారాయణ రెడ్డి, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, టెక్నికల్ సిబ్బంది సంజయ్, వివిధ మండలాల తహసీల్దార్లు డిప్యూటీ తహసీల్దారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది, తదితరులు పర్యవేక్షణలో డిజిటి క్లోజ్డ్ వాహనాల్లో హమాలీలతో ఈవీఎంలను లోడ్ చేయించి నియోజకవర్గాల వారీగా తరలింపు ప్రక్రియను దగ్గర ఉండి పూర్తి చేస్తున్నారు.

ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావర ణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం ఏలూరు సర్. సి ఆర్ ఆర్ కళాశాల ఆడిటోరియంలో సార్వత్రిక ఎన్నికల మైక్రో అబ్జర్వర్లకు తొలివిడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ హాజరై మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల నిర్వహణ అంశాల పర్యవేక్షణలో వారు గమనించాల్సిన అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్‌కు కళ్లు, చెవులు వంటి వారని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్ప మణి, డిఆర్ డిఏ పిడి డాక్టర్ ఆర్. విజయరాజు, సమగ్రశిక్షా అభియాన్ ఎపిసి బి. సోమశేఖర్, మైక్రో అబ్జర్వర్లకు స్క్రీన్ ప్రెజెంటేషన్ ద్వారా వారి విధులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె.కాశీ విశ్వేశ్వరరావు,మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలికపై అత్యాచారయత్నం : కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: ఏడేళ్ల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన 38 ఏళ్ళ వ్యక్తి పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామంలో 2వ తరగతి చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి చీమలు తొలగిస్తానని చెప్పి ఇంటికి తీసుకెళ్ళి వస్త్రాలు తీసి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాలిక శరీరంపై గాయాలు గుర్తించిన ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యక్తి పై అత్యాచార నిరోధక చట్టం ప్రకారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చట్టబద్ధమైన గ్రామ సభలు జరపాలి

విశాలాంధ్ర - ఏలూరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని చట్టబద్ధమైన గ్రామసభలు నిర్వహించాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎలక్షన్ మోడల్ కోడ్ అఫ్ కాండక్టుకు అనుగుణంగా గ్రామ సభలు నిర్వహించాలని అన్నారు. ఓటర్లను ప్రభావం చేసే అంశాలు గ్రామసభలో చర్చించకూడదని, తీర్మానాలు చేయకూడదని డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. గ్రామ సభ ప్రారంభం ముందు ఎన్నికల ప్రవర్తన నియమావళి చదివి వినిపిస్తే మంచిదని అన్నారు. గ్రామసభ వేదికను స్వీప్ కార్యకమాలకు ఉపయోగించుకొని ఓటింగ్ శాతం పెరగడానికి, ఏథికల్ ఓటింగ్ జరగడానికి పంచాయతీ కార్యదర్శి చర్య తీసుకోవాలని, కళాజాత కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భద్రాచలానికి పాదయాత్ర

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలానికి భక్తులు పాదయాత్ర చేస్తూ తరలి వెళ్లారు. మండలంలో పొంగుటూరు గ్రామానికి చెందిన యాభై ఐదుమంది భక్తులు తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రానికి పాదయాత్ర ప్రారంభించారు. ఈనెల 17 వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా 16 వ తేదీ నాటికి తామంతా భద్రాద్రికి చేరే ప్రణాళికలతో పాదయాత్ర ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు పదకొండు సార్లు పాదయాత్ర నిర్వహించామని పన్నెండవ విడతలో భాగంగా తరలి వెళుతున్న భక్త బృందం సభ్యులకు పలు గ్రామాలలో హైందవ సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి పూజలోకి సంబంధించిన పూజా సామాగ్రిని వారు వెంటబెట్టుకుని వెళ్లారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో మే 13వ తేదీ సోమవారం నిర్వహించే సాధారణ ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక సర్. సిఆర్ ఆర్ కళాశాలలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమ అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు 1743 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో సుమారు 16.33 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. గత మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేస్తూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో గుర్తించిన 415 సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లోఎన్నికల నిర్వహణ ప్రక్రియను పరిశీలించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించి వారికి శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను నియంత్రించేందుకు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను నిరోధించేందుకు 46 ఫ్లైయింగ్ స్క్వాడ్లను, 8 అంతరాష్ట్రచెక్ పోస్టులను , 36 స్టాటిక్ సర్వేలైన్స్ టీం లను నియమించినట్టు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఇంతవరకు కోటి 75 లక్షల రూపాయల నగదును , కోటి 25 లక్షల విలువైన మద్యాన్ని, రూ. 10.50 కోట్ల విలువైన బంగారం తదితరాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల సంబంధితఫిర్యాదులను అందజేసేందుకు కంట్రోల్ రూం లో ఏర్పాటు చేసిన 9491041435, టోల్ ఫ్రీ నెం. 18002331077 కు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం

జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి రఘునంద

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహము, మార్కెటింగ్ కల్పించుటకు ఇన్వెస్ట్ ఇండియా పథకంలో భాగంగా 2023 సంవత్సరములో ఒక జిల్లా - ఒక ఉత్పత్తి కార్యక్రమం క్రింద ఏలూరు జిల్లానుండి ఏలూరు తివాచీ ఉత్పత్తులు గుర్తించబడ్డాయని జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి ఎస్. రఘునంద తెలిపారు. ఈ ఏడాది ఏలూరు జిల్లానుండి తివాచీ ఉత్పత్తులను ఒక జిల్లా - ఒక ఉత్పత్తి క్రింద అవార్డు ఎంపికకై సిఫారసు చేయుట జరుగుతుందన్నారు. దీనిలో గుర్తింపు పొందితే ఈ ఉత్పత్తులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించి గిరాకీ పెరగడమే కాక ఉపాధి పెరుగుటకు అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా కేంద్ర మైన ఏలూరు నగరంలో సహజ రంగు తివాచీలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందన్నారు. తివాచీలు తెలుపు, నలుపు, బ్రౌన్, సెమీ బ్లాక్ లేదా గ్రే వంటి రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి తక్కువ సాంద్రత కలిగిన నాట్‌లతో అల్లినవి, అందువల్ల ఇది విస్తృతంగా ఎగుమతి చేయబడతాయన్నారు. వీటిని ఇంతకుముందు హర్‌హమ్ కార్పెట్‌లుగా పిలిచేవారు. డిజైనర్లచే క్రమంగా బహుళ రంగులతో భర్తీ చేయబడ్డాయియన్నారు. ఇరాన్, అరబ్ దేశాలకు చెందిన కార్పెట్ నేత కార్మికులు మచిలీపట్నం పట్టణానికి తివాచీ నేసే కళను పరిచయం చేశారని, తరువాత పసుపు రంగు సహజ వనరు అయిన తంగెళ్లముడి అనే పొద విలాసవంతమైన సరఫరా కారణంగా ఏలూరులోని నైపుణ్యం కలిగిన కార్మికులు దీనిని స్వీకరించారని నమ్ముతారు. ఇక్కడ కార్పెట్ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ఇదే కారణమని భావిస్తున్నారన్నారు. డిజైన్లు ఇండో-పర్షియన్ మూలానికి చెందినవని తెలిపారు.ఏలూరులోని తివాచీలు తరచుగా వాటిని సృష్టించే కార్పెట్ తయారీదారుల పేరు మీద ఉన్నాయి. హుస్సేన్‌ఖని, అమర్‌ఖాని, రామచంద్ర ఖని, రెడ్డి ఖని, గోపాల్‌రాఖని మొదలైన రకాలు ఉన్నాయి.

దిల్లీఖనిలో పడవలు (కిష్టి), పూల ఆకృతులు ఉంటాయి, అయితే తొట్టీఖని పూల కుండీలపై ఆధారపడిన డిజైన్-కూర్పు. ఈ తివాచీల నమూనాలకు అంబార్చ, జామ, బాబుల్, జంపాల్ వంటి పండ్లు, పువ్వుల పేరు పెట్టారు. ఏలూరు కార్పెట్‌ల డిజైన్‌లు ఎక్కువగా పూల లేదా రేఖాగణితంగా ఉంటాయి, అయితే షేడ్స్ కలయిక నీలం, ఆకుపచ్చ మిశ్రమంతో మృదువైన పసుపు, పాస్టెల్‌లతో గుర్తించబడుతుంది. సాంప్రదాయ తాలీమ్ టెక్నిక్‌ని ఉపయోగించి సగం-తెలుపు నేపథ్యంతో లోతైన ఆకుపచ్చ, నారింజ డిజైన్‌లతో అనేక సంక్లిష్టమైన డిజైన్‌లు అల్ల బడ్డాయి.ప్రస్తుతం ఏలూరు నగరము లోని లక్ష్మి వారపు పేట, తంగెళ్ళమూడి లలో సుమారు (40) కుటుంబములు సహజమైన దేశీయ ఉన్ని, సహజ సిద్ధ రంగులతో వివిధ రకములైన తివాచీలను తయారుచేసి సొంతంగాను, లేపాక్షి సంస్థ ద్వారాను, జాతీయ అంతర్జాతీయ ప్రదర్శనలలో అమ్మకములు జరుపుతున్నట్టు తెలిపారు.

అధికార పక్షాలకు ఓట్లు అడిగే హక్కు లేదు

విశాలాంధ్ర-కామవరపుకోట: గత పది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ నాయకత్వంలో పాలిస్తున్న ఎన్డీఏ కూటమిని గత ఐదేళ్లుగా రౌడీలతో రాజ్యమేలుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడిగే హక్కు లేదని, సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కామవరపుకోటలో సిపిఐ ప్రజా సంఘాల శ్రేణులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా ఏర్పడినప్పుడు నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్ కు ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హెూదా ఇస్తామని చెబితే ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి నేతలు రాబోయే కాలంలో తాము అధికారం లోకి వస్తే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా ఇస్తామని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాను ముఖ్యమంత్రిని అయితే ఆంధ్ర కు ప్రత్యేక హెూదా తీసుకురావడం కోసం ప్రధానమంత్రిని కాలర్ పట్టుకుని నిలదీసి ప్రత్యేక హెూదా సాధిస్తానని మాట ఇచ్చి నెలకు మూడుసార్లు ఢిల్లీకి వెళ్లి నరేంద్ర మోడీ కాలర్ పట్టుకోవటం మాని కాళ్లు పెట్టుకుని తనమీదఉన్న పలు క్రిమినల్ కేసులు మాఫీ చేసుకోవడం కోసం ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని బిజెపి ప్రభుత్వానికి తనఖా పెట్టారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాదులను, అవకాశవాదులను తరిమికొట్టాలని టీవీఎస్ రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, ఏమంద్ర స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గదుల సత్య నారాయణ, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కన్వీనర్ శెట్టి నాగ బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు బాలిన రమణారావు, యువజన సమాఖ్య నాయకులు నల్లమోతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్లపై అక్రమ మోటర్లుంటే చర్యలు

విశాలాంధ్ర-కైకలూరు: ప్రస్తుత వేసవి కాలంలో కైకలూరు మండల కాలువ గట్లు పై ఇతరుల మోటర్లుఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తుల పై నిబంధలననుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్టు కైకలూరు తహశీల్దార్ ఎస్ . పోతురాజు హెచ్చరించారు. త్రాగునీటి ఎదడి దృష్ట్యా కలెక్టరు వారి ఆదేశముల ప్రకారం ప్రకాశం బ్యారేజి నుండి ఇరిగేషన్ కాలువల ద్వారా నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు. సదరు కాలువల్లో నీటిని కైకలూరు మండలంలో మంచినీటి చెరువులు నింపుటకు మాత్రమే అనుమతించినట్టు పేర్కొన్నారు. సదరు నీటిని ఎవరైనా అక్రమంగా కాలువలలో మోటర్లు పెట్టి చేపల చెరువులకు, ఇతర అవసరముల నిమిత్తం వినియోగించరాదని ఫిషరీస్ డిపార్టు మెంటు వారిద్వారా నోటీసులు జారీచేసినట్టు తెలిపారు. కాలువ గట్టు పై పెట్టిన మోటర్లు వెంటనే తొలగించుకోవల్సిందిగా ముందుగా తెలియ జేశామన్నారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ప్రజల మంచి నీటి అవసరాలు తీర్చుటకు గ్రామపంచాయతీ పరిధిలోని మంచి నీటి చెరువులు నింపుటకు మాత్రమే గ్రామపంచాయతీ / ఇరిగేషన్ / ఆర్ డబ్ల్యు ఎస్ అధికారుల ఆధ్వర్యంలో పెట్టిన మోటర్లు మాత్రమే అనుమతించనున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

రేషన్ షాపులకు కందిపప్పు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు, విధివిధానాల ప్రకారం జనవరి 2023 నుండి మార్చి ' 2024వరకు నిత్యావసర సరుకుల కేటాయింపునకు మొత్తం 1451.404 మెట్రిక్ టన్నుల కందిపప్పు ఏలూరు జిల్లాలోని అన్ని మండలాలలోని రేషన్ షాపులకు పంపిణీ చేసినట్టు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కె.మంజు భార్గవి తెలిపారు.జిల్లా లోని తెల్ల రేషన్ కార్డుదారులందరికి కందిపప్పుతో పాటు బియ్యము, పంచదార, గోమము పిండి కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలోని రేషన్ డీలర్లు కంది పప్పు కొరకు డిడి లను కట్టిన ప్రతి రేషన్ షాపునకు కంది పప్పు ను సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ చింతలపూడి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం టీవీఎస్ రాజు, జి. రమణ రాజు, కంచర్ల గురవయ్య అధ్యక్షతన సీపీఐ

కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న రైతులను, కార్మికులను, నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన ఏ వాగ్దానాన్ని అమలుపరచలేదని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు పరం చేస్తుందని విమర్శించారు. మేధావులు, కవులు, కళాకారులను, జైల్లో పెట్టిందని, అనేకమంది ప్రతిపక్ష నాయకులను, ముఖ్యమంత్రిలను సిబిఐ,ఈడీ కేసులతో అరెస్టులు చేసి వారిని భయభ్రాంతులను చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై అనేక భౌతిక దాడులు, ముస్లిం మైనార్టీలపై పాశవికంగా దాడులు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తుంటే అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాన్ని ఏమాత్రం ప్రశ్నించలేదని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో భాగంగా సిపిఐ, సిపిఎం,కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి కృష్ణ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొర్లపాటి బాబు, గొలిమే బాల యేసు, గంధం అంజమ్మ, సీపీఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్ర రెడ్డి, బోడ వజ్రం, ఎస్.కె.కాలేషా, పట్టణ కార్యదర్శి ఎస్.కె.జానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కవి విఎస్వి ప్రసాద్‌కు సన్మానం

విశాలాంధ్ర- తణుకు : ఐఎస్ఓ గుర్తింపు పొందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా తెనాలి పట్టణంలో సీనియర్ సిటిజన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో తణుకు పట్టణ కవి వి ఎస్ వి ప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. కవిత రూప వినతి అనే కవితను ప్రసాద్ రచించి చదివి వినిపించారు. కవి ప్రసాద్ వివరించిన తీరుకు సభా సదులు, సాటి కవులు ఆయనను అభినందించి ఘనంగా సత్కరించారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పెద్దేటి యోహాన్, డాక్టర్ రంగిశెట్టి రమేష్, అక్షయ సాహితీ సమితి అధ్యక్షులు ఉన్నం మేరీ సుజాత, సర్వశ్రీ ఐనాల మల్లేశ్వరరావు, డి.అనిల్ కుమార్ తదితరులు కవి విఎస్వి ప్రసాద్‌ను నగదు బహుమతి జ్ఞాపిక, ప్రశంస పత్రం, శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. తణుకు పట్టణ ప్రముఖులు, రాష్ట్రస్థాయిలో సాహితీ వేత్తలు, కవులు తదితరులు కవి వి ఎస్ వి.ప్రసాద్‌ను అభినందించారు. ఇప్పటివరకు 360 అత్యుత్తమ కవితా పురస్కార అవార్డులను అందుకున్నందుకు ప్రసాద్ ను ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరెన్నో పురస్కారాలను అందుకోవాలని పలువురు ఆశించారు.

పారిశుధ్య వాహన డ్రైవర్ ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-ముదినేపల్లి : గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య పరిరక్షణకు ఏర్పాటు చేసిన వాహన డ్రైవర్ ఆకస్మిక మృతి చెందడంతో గ్రామపంచాయతీ సిబ్బంది , గ్రామస్తులలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ముదినేపల్లి మండలం వెయ్యేరు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య వాహన డ్రైవరుగా ముదినేపల్లి అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన దూబ విజయ్ కుమార్ (30) పని చేస్తున్నాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. శనివారం విజయ్‌కు తీవ్ర అనారోగ్య సమస్య తలెత్తడంతో వెంటనే మృతి చెందాడు. ఇతనికి భార్య ఉంది. విజయ్ కుటుంబాన్ని పెయ్యేరు, ముదినేపల్లి సర్పంచులు అల్లు సుశీల, నిమ్మగడ్డ కైకమ్మ, బిక్షాలు, స్థానిక నాయకులు జాస్తి బాబు రాజేంద్రప్రసాద్, టిడిపి నాయకులు కొదాలి వినోద్, ముదినేపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది కుటుంబాన్ని పరామర్శించారు.

ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర అత్యంత కీలకం : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన పోలింగ్ ప్రక్రియను ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన, జాగ్రత్త లతో సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కోరారు.శనివారం స్థానిక కస్తూరిభా బాలికోన్నత పాఠశాలలో ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు,ఎన్నికల నిర్వహణ అంశాలపై తొలివిడత శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ హాజరై పివోలు, ఏపీఓలకు పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే పోలింగ్ ప్రక్రియ అతి ముఖ్యమైనదని, ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాల్సిన గురుతర బాధ్యత పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులదే నని తెలిపారు. గతంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో పోలింగ్ నిర్వహించిన అనుభవం ప్రిసైడింగ్ అధికారులకు ఉన్నప్పటికీ, వివిప్యాట్ యంత్రాలను అనుసంధానం చేసి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లకు వివిపాట్లను సరైన రీతిలో జోడించే విధానం గురించి సమగ్ర అవగాహన పొందాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఏవైనా సందేహాలు ఉంటే వాటిపై నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు నింపవలసిన ఫారాలన్నింటిని పోలింగ్ ముగిసిన వెంటనే సక్రమంగా పూర్తి చేసి సిద్ధం చేసుకుంటే, రిసెప్షన్ కేంద్రంలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం రాదన్నారు. పోలింగ్ ముందు రోజు నిర్దేశించిన సమయంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన పోలింగ్ యంత్రాలు, మెటీరియల్ సేకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యం. ముక్కంటి, ఎఆర్ఓ వి. మురార్జి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలు, పిఓలు, ఏపిఓలు, పాల్గొన్నారు.

15న గూడెంలో సీఎం జగన్ పర్యటన

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైకాపా అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈనెల 15వ తేదీ సోమవారం తాడేపల్లిగూడెం రానుంది. జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు వైఎస్ఆర్సిపీ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన భీమవరంలో రోడ్ షో, మేమంతా సిద్ధం సభ జరుగుతుందన్నారు. అనంతరం భీమవరం నుంచి బయలుదేరి బస్సుయాత్ర తాడేపల్లిగూడెం చేరుకుంటుందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డు నుంచి తాడేపల్లిగూడెం రూరల్ మండలం, పెంటపాడు మండలాలలోని ప్రతి గ్రామం నుంచి వందలాదిమంది జనం వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.సమయం తక్కువగా ఉన్నందున తక్షణమే పార్టీ శ్రేణులు రంగంలోకి దిగి ఈ నెల 15వ తేదీ సోమవారం తాడేపల్లిగూడెంలో జరిగే జగన్ పర్యటన, మేమంతా సిద్ధం బస్సుయాత్ర, రోడ్డు షోలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో సొసైటీల చైర్మన్లు, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డులు ఇన్చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి నాయకుల మాటలను ప్రజలు నమ్మరు

విశాలాంధ్ర-లింగపాలెం: కూటమి నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వైసిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ అన్నారు. ధర్మాజీగూడెంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈయనతో పాటు చింతలపూడి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కంభం విజయరాజు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చేందుకు అడ్డదారులలో ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని వీటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ పట్ల ప్రజలు అభిమానంతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి నాయకులంతా కలిసి పనిచేస్తున్నారని అన్నారు. ఈ నియోజకవర్గాన్ని గెలిపించడంలో సీఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో స్థానిక నాయకులు ఉప్పలపాటి వరప్రసాద్, మోరంపూడి జగన్, మేకల రాజు, చల్లా గంగాధర్, సొంగ సందీప్, గారపాటి రాంబాబు, మట్ట సురేష్, నూతలపాటి శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెం కాలేజీని అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-లింగపాలెం : ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని డిఐఈఓ ప్రభాకర్ తెలిపారు. కాలేజీలో ఈ ఏడాది ఇంటర్ ఫలితాలలో సున్నా రావడం కాలేజీలో సౌకర్యాలు లేకపోవడం దుస్థితిపై విశాలాంధ్రలో ప్రచురించిన కథనంపై డిఐఈఓ స్పందించారు. దీనిపై ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ కాలేజీలో సమస్యలు ఉన్నాయని అంగీకరించారు. ఈ సమస్యలను చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తామని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు గ్రామ ప్రజల సహకారం తీసుకుంటామని వీరితో ఒక కమిటీని నియమిస్తామని వెల్లడించారు. ఇప్పుడున్న ఆర్ట్స్ గ్రూపులతో పాటు ఎంపీసీ గ్రూపును నిర్వహిస్తామని. గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా లెక్చరర్లను నియమిస్తామని వెల్లడించారు. గ్రామప్రజల సహకారంతో కాలేజీని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు మండలం 33 కెవి వంగాయగూడెం - ఏలూరు ఫీడర్ ట్రీ కట్టింగ్, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం గం.6 నుండి మధ్యాహ్నం గం.12 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.పి.బి.నటరాజన్ తెలిపారు. అందువల్ల పవర్ పేట సెక్షన్ 33/11కెవి ఏలూరు సబ్ స్టేషన్ పరిధి లో ఉన్న 11కెవి వెంకన్న ట్యాంక్ ,11కెవి పవర్ పేట ,11కెవి రామకృష్ణపురం, 11 కెవి పోణంగి,11 కెవి గ్రీన్ సిటీ ఫీడర్స్ పరిధిలో గల పడమర వీధి,పాత బస్టాండ్,వసంత మహల్, రామకృష్ణ పురం, గ్రీన్ సిటీ,హనుమాన్ నగర్, గొల్లయ గూడెం,గులాబి తోట,నెహ్రూ కాలనీ,కొబ్బరి తోట,వంగాయ గూడెం, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

జగన్ గెలుపుకోసం అభిమాని బైక్ యాత్ర

విశాలాంధ్ర-ఆచంట: శ్రీకాకుళం జిల్లా నుంచి ఓ వ్యక్తి చేపట్టిన బైక్ యాత్ర శుక్రవారం ఆచంట చేరుకుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సన్యాసిరావు అనే వ్యక్తి జగన్ మీద అభిమానంతో శ్రీకాకుళం జిల్లా నుంచి బైక్ యాత్ర మొదలుపెట్టాడు. 2024 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందని నియోజకవర్గాల వారీగా ప్రచారం చేస్తూ ఆచంట నియోజకవర్గానికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆచంట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆ వ్యక్తికి శుభాకాంక్షలు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలలో ఒకేషనల్ కోర్స్ చదివిన విద్యార్థులు ఇంటర్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఏలూరు జిల్లాలో ముందంజలో ఉన్నారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 54 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 45 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పిషరీస్ కోర్సులో బి. అభి 922మార్కులు, విటర్నరీ కోర్సులో జే. ప్రభాకర్ 915 మార్కులు, అగ్రికల్చర్లో కె.ఏసమ్మ 840 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 మంది విద్యార్థులు పరీక్షల రాయగా 32 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో జి.మహ్మద్, తాళ్లూరి రాయుడు, ధారా అనిత ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరు సాధించిన ఫలితాలపై కాలేజీ కరస్పాండెంట్ చలసాని రత్నాకర్, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. వృత్తివిద్య కోర్సులు వల్ల స్వయం ఉపాధికి అవకాశాలు ఉంటాయని వీరు పేర్కొన్నారు.

బీసీలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర - పెంటపాడు: బీసీలకు అండగా ఉంటామని నర్సాపురం ఉమ్మడి ఎంపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తాడేపల్లిగూడెం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సమాజంలో అత్యధికంగా ఉండే బీసీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన వాటాను ఇవ్వకుండా జగన్ మోసం చేశారని తెలిపారు. వారికి రాబోయే ప్రభుత్వం ఆధ్వర్యంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పెంటపాడు మండలం పడమర విప్పరులో బీసీల ఆత్మీయ సమ్మేళనం లో వారు మాట్లాడారు. బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలను జగన్ తన స్వార్థ రాజకీయాల కోసం మోసం చేశారని చెప్పారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు వెన్నుదన్నుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నరసాపురం పార్లమెంటు మీడియో ఇన్చార్జి నరిశే సోమేశ్వరరావు, గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకటరావు టిడిపి జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

విశాలాంధ్ర - పెంటపాడు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడిఏ పి.మురళీకృష్ణ అన్నారు బుధవారం ఆయన ఆకుతీగపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అన్నారు. ఏవో పార్థసారధి మాట్లాడితే మండలంలో మొత్తం 17 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విఏఏలు సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ వారికి వెండి వస్త్రాలు బహూకరణ

విశాలాంధ్ర - పాలకొల్లు : పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో జిన్నూరు గ్రామదేవత అయిన పోలేరమ్మ అమ్మవారికి రూ.10 లక్షలు విలువైన, వెండి చీర, కవచ ఆభరణము, రజిత కాపాల మాలిక, శరీర వస్త్రధారణ ఆభరణాలు, వెండి కిరీటం, జిన్నూరు గ్రామానికి చెందిన కొప్పర్తి సూర్యనారాయణ, శ్రీదేవి దంపతులు శనివారం బహూకరించారు. మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి వీటిని కానుకగా సమర్పించారు. గ్రామ ఉత్సవకమిటీ, పెద్దలు, కొప్పర్తి సూర్యనారాయణ మిత్రబృందం పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో మారుతీ జూనియర్ కాలేజి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-తణుకు: తాజాగా విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మారుతి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచారు. ఈ మేరకు అత్యుత్తమ ప్రతిభను కనపరచిన విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు అభినందించాయి. ఈ సందర్భంగా మారుతి కాలేజ్ చైర్మన్ ఎస్ వి వి సత్యనారాయణ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎం పి సి విభాగంలో ఎం. శిరీష(968), పి.పూర్ణ వెంకటలక్ష్మి (959) బైపీసీ విభాగంలో ఎండి అస్మా (969), పి. నాగ మౌనిక(962) సీఈసీ విభాగంలో కె. సత్యశ్రీ (851)వి హేమ సాయి (826)లు అత్యధిక మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో ఎ. భార్గవి దుర్గా సాయి శ్రీ(460), జె. ప్రణతి (460), సిహెచ్ కీర్తన(437), జి రామలక్ష్మి(433), బైపీసీ విభాగంలో జి లలితాదేవి (396), వై ప్రవల్లిక (373), సీఈసీ విభాగంలో జి. జయ మాధురి తదితరులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. కళాశాల చైర్మన్ ఎస్ వి వి సత్యనారాయణ (నాని)విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ హెచ్ ఆర్ వి. నాగరాజు, డైరెక్టర్లు ఎన్. కనకయ్య, తంగిరాల ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

భర్త గెలుపు కోసం ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

విశాలాంధ్ర - పాలకొల్లు : పోడూరు మండలం రావిపాడు గ్రామంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్య కుమారి శనివారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తన భర్తకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. గ్రామం అంతా మహిళలు యువకులు టిడిపి నాయకులు ర్యాలీగా తిరుగుతూ సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పెన్మెత్స రామభద్రరాజు, పెనుమదం గ్రామ కమిటీ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, టిడిపి మండల నాయకులు దేవరపు దొరబాబు, తంగెళ్ల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కడలి శ్రీను గుబ్బల శ్రీరామ్, పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తరలింపు జెసిబి ట్రాక్టర్లు సీజ్

విశాలాంధ్ర-ముదినేపల్లి : గ్రామాల్లో పొలాల్లో మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో పొలాల్లోని మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా జెసిబితో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తోలకాలు సాగిస్తున్నారు. దీనిపై స్పందించిన స్థానిక రెవెన్యూ అధికారి జెసిబి , ట్రాక్టర్లను ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయం వద్దకు తరలించారు. తహసీల్దార్ ఎస్ఎల్ఎస్ కుమారి దీనిపై సోమవారం వాహనదార్లపై చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: పోలవరం నియోజకవర్గం అభ్యర్థి విషయంలో చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం అని టిడిపి నాయకులు జయ్యవరపు శ్రీరామ మూర్తి, నల్లూరి వెంకట చలపతి రావు తెలిపారు. టి నరసాపురంలో టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణా రావు గౌడ్ జన్మదిన వేడుకలు మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వర్గీయ ఎన్ టీ ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్

చేసి రామకృష్ణారావు గౌడ్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలందరూ పొత్తు ధర్మాన్ని పాటించి కూటమి అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మొడియం సూర్యచంద్రరావు, మేఘాలా దేవి, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ,రాజా బాబు,నాళం కాశీ, అనుమోలు సంధ్యా రాణి శ్రీనివాస రావు, భీమవరపు జగన్మోహన రావు, బండి శ్రీనివాస రావు,పెద్దిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జె బ్రాండ్ మత్తులో రాష్ట్రం

విశాలాంధ్ర -భీమవరం: జగన్ పాలనలో ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ మత్తులో తూగుతున్నదని, రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం అంతా జగన్ కుటుంబీకులదేనని బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. భీమవరంలోని బిజెపి ఎన్నికల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యపాన నిషేధం పేరుతో జగన్ లక్ష కోట్లు లూటీ చేశారని, కల్తీ మద్యంతో వేల మంది మహిళల మంగళసూత్రాలను తెంచారని ఆరోపించారు. జే బ్రాండ్ల ద్వారా దోచుకున్న లక్షల కోట్ల డబ్బును కంటెనర్ల ద్వారా ఎన్నికల్లో పోటి చేస్తున్న వైసీపీ నాయకులకు తరలించారని, సంపూర్ణ మద్యపాన నిషేధం అని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వమే మద్యం అమ్మేలా చర్యలు చేపట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, పి.వి.ఎస్.వర్మ, పట్టణ అధ్యక్షులు కాయిత సురేంద్ర, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర -భీమవరం : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఎస్ ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ మంచి ఫలితాలతో విజయ దుందుభి మోగించిందని జోనల్ ఇన్చార్జి దేవేందర్ తెలియజేశారు. శనివారం భీమవరంలో ఆయన మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో కొవ్వూరి లోకేష్ రెడ్డి 470 మార్కులకు గాను 464 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, పెద్దిరెడ్డి రవి 463 సాధించి ద్వితీయ స్థానంలోనూ, గెలాం గిరిధర్, దేవాసి మనీష 460 సాధించి తృతీయ స్థానంలో నిలిచారని, బైపీసీ విభాగంలో ఆంధ్రు కీర్తన, ఎండీ. సమ్రీన్ సుల్తానా లు 440మార్కులకుగాను 430 మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ద్వితీయ సంవత్సరంలో రోషిణి 985/1000, జవ్వాడి నిర్దేష్ 981/1000 సాధించారని ఆయన సంతోషం వెలిబుచ్చారు. సంస్థ పెట్టిన అనతి కాలంలోనే మంచి ఫలితాలు సాధించిందని తమ పాఠ్యప్రణాళిక, లెక్చరర్ల శ్రమ,విద్యార్థుల పట్టుదలతో ఘనవిజయం సాధించామని విద్యార్థులను, సిబ్బందిని ఆయన అభి నందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వి.నాగరాజు, ఎస్.వి.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు అసెంబ్లీ ఎఐఎఫ్ అభ్యర్థి 'లావేటి'కి 'బి ఫామ్' అందజేత

విశాలాంధ్ర - కైకలూరు : ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో విజయవాడ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి సుందర రామరాజు చేతుల మీదగా కైకలూరు నియోజకవర్గానికి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా "బి ఫామ్" పత్రాన్ని కైకలూరు నియోజకవర్గం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్బి) అభ్యర్థి లావేటి వీర శివాజీ అందుకున్నారు. ఈ సందర్భంగా లావేటి వీర శివాజీ మాట్లాడుతూ దేశభక్తి జాతీయ భావాలు జాతీయ స్ఫూర్తితో ఆనాడు ఆజాద్ హిందుఫౌజుదళపతి నేతాజీ ఈ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారని, ఈ పార్టీ తరపున కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం చేపడతానన్నారు. మంచినీటిని అందరికీ అందజేస్తానని, కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపుతానని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని, తాను అందరికీ తెలుసని, కరోనా కష్టకాలంలో ప్రజలకు ఎనలేని సేవ చేశానని, కైకలూరు అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని అన్నారు.

ఎస్సీల మేలుకోరేది కూటమి ప్రభుత్వమే

విశాలాంధ్ర-పోడూరు: ఎస్సీల మేలుకోరేది టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వమేనని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామా నాయుడు సతీమణి నిమ్మల సూర్య కుమారి అన్నారు. పోడూరు మండలం రావిపాడు లో శనివారం టిడిపి జనసేన బిజెపి శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే రామానాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. జగన్ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధితోపాటు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునే పథకాలు అందుతాయని సూర్య కుమారి తెలిపారు. మండల టీడీపీ నాయకులు గొట్టుముక్కల సూర్యనారా యణ రాజు, బొణం చిన్నబాబు, పెన్మత్స రామభద్రరాజు, సిద్దానీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్.బి.కె.ల ద్వారా ధాన్యం సేకరణ ప్రారంభం

విశాలాంధ్ర-పాలకోడేరు : పాలకోడేరు మండలంలో రబీ సీజన్ సంబంధించి వరి కోతలు ప్రారంభించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి నారాయణరావు తెలిపారు. ఈ సీజన్లో మండలంలో 11,500 ఎకరాలలో వరి సాగు జరిగిందని, దానిలో 90 శాతం 11 21 రకం రైతు సోదరులు సాగు చేశారని,ప్రస్తుతానికి గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలో దాళ్వా కోతలు మొదలైనట్టు,రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతున్నట్టు ఆయన తెలియజేశారు.ఎకరాకు సరాసరి 50 నుండి 52 బస్తాల వరకు దిగుబడి వస్తున్నట్లు తెలియజేశారు. పాలకోడేరు మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల నందు సుమారు రెండు లక్షల గోనే సంచులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గరగపర్రు రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు సందర్శించి ధాన్యం కొనుగోలు, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం. స్వరూప, ధాన్యం కొనుగోలు సహాయకులు, మండల వ్యవసాయ సహాయ కమిటీ సభ్యులు చింతలపాటి సూర్యనారాయణరాజు, రైతులు పాల్గొన్నారు.

వడ్లపట్లలో అంబేద్కర్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-భీమడోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషి చెయ్యాలని, యువత విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని భీమడోలు సిఐ బిబి రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం భీమడోలు మండలం వడ్లపట్ల, నరెడ్లగూడెం గ్రామాల వేదికగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలలో భీమడోలు సిఐ రవికుమార్, ఎస్ఐ సుధాకర్తో కలిసి పాల్గొన్నారు. ఈమేరకు వడ్లపట్ల ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిఐ రవికుమార్, ఎస్ఐ సుధాకర్ చేతులమీదుగా పుస్తకాలు, పరీక్షల ప్యాడ్స్, పెన్నులను అందజేసారు. తొలుత గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ ఆదివారం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని ముందస్తుగా శనివారం పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ కార్యక్రమం అభినందనీయం అని అంబేద్కర్ యువజన సంఘం వారిని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్ఎం ఝాన్సీ రాణి, ఉపాధ్యాయిని భాగ్యలక్ష్మిని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సత్కరించారు.. కార్యక్రమంలో వడ్లపట్ల, నరెడ్లగూడెం గ్రామాల అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా పని చేద్దాం... కూటమి జెండా ఎగరేద్దాం..

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: బూత్ ఏజెంట్ల సమావేశంలో టిడిపి, జనసేన,బిజెపి మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు రాబోయే నెల రోజుల్లో కలిసికట్టుగా పనిచేసి కూటమి జెండా ఎగరవేద్దామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం లోని గొర్రెల సూరన్న కాంప్లెక్స్ లో శనివారం పట్టణంలోని 13 నుంచి 25 వార్డుల బూత్ ఇన్చార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ చిన్న పెద్ద బేషజాలు, భేదాలు లేకుండా పార్టీల మధ్య తారతమ్యం లేకుండా అంతా బాధ్యత వహించి కూటమి గెలుపుకే పనిచేయాలని కోరారు. అవినీతి వైసీపీ పార్టీ నుంచి ఎన్నో ప్రలోభాలు, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను మనం తిప్పి కొట్టాలని కోరారు.బూత్ ఇంచార్జ్ లు అందరికీ స్వేచ్ఛనిస్తున్నామని, కింద స్థాయి కేడర్ను అందర్నీ కలుపుకొని వెళ్లి పార్టీ విజయానికి బాటలు వెయ్యాలని కోరారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని. ఒకరిపై ఒకరికి ఎలాంటి భేదభిప్రాయాలు పెట్టుకోకుండా నెల రోజులు ఒక యుద్ధంలా పనిచేయాలని దానికి తాను సైన్యాధ్యక్షుడిగా ఉంటానని పేర్కొన్నారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకాలను రాష్ట్రంలో జగన్ బొమ్మ వేసి వారు ప్రచారం చేసుకుంటున్నారని వాటిని ప్రజలకు అర్థమయ్యే విధంగా కార్యకర్తలు నాయకులు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు భూతి ఇన్ఛార్జిలు హాజరయ్యారు.

వేడింగిలో అమ్మవారి జాతర నిర్వహణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర- పోడూరు: మండలంలోని వేడంగిలో ఈ నెల చివరి వారంలో గోగులమ్మ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించడానికి

ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అమ్మవారి ప్రతిరూపాలయిన గరగలను ప్రధాన ఆలయం నుండి గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన పూరిగుడికి మేళ తాళాలతో కమిటీ పెద్దలు తీసుకువచ్చారు. అమ్మవారికి 15 రోజులపాటు నిత్య దూప దీప నైవేద్యాలతో పూజలు జరిపిన అనంతరం ఈ నెల 28 నుండి మూడు రోజులు జాతర జరిపి అమ్మవారిని ప్రధాన ఆలయానికి సాగనంపనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొలిశెట్టి విశ్వేశ్వరరావు, కార్యదర్శి కోట రామారావు తెలిపారు.

జగన్ పాలనలో పేదలకు మేలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్ళీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలంతా సిద్దంగా ఉన్నారని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శనివారం పట్టణ వైసీపీ

అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో స్థానిక 21,22 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్ కుమార్ను, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయ రాజును అధిక ఓట్లతో గెలిపించాలని వైసీపీ పోలవరం నియోజక వర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు, వైసిపి నాయకులు జెట్టి గురునాధరావు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, మండవల్లి విజయసారధి,మేడవరపు విద్యాసాగర్ తదితర నాయకులు ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. మళ్ళీ వైసీపీ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవీ రత్నం,వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కాసర తులసి రెడ్డి , వైసిపి షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, ఏలూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సభ్యులు గెద్దాడ శ్రీనివాసరావు, ఆయా వార్డుల కౌన్సిలర్ లు తడికమళ్ళ మురళి, కంచర్ల గీత, నేకూరి కిషోర్, సంకు సురేష్ ,దొంతు మాధవ్, ఎల్.వి.ఆర్, గోకుల పారిజాత గిరి దేవస్థాన చైర్మన్ గూడపాటి రాధాకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి ముప్పిడి శ్రీను , ఏరియా హాస్పిటల్ హెచ్ డి ఎస్ డైరెక్టర్ రాపోలు బావన ఋషి,వైసీపీ యూత్ పట్టణ అధ్యక్షులు కాసర్ బన్నీ రెడ్డి, కే. ప్రకాష్, బిలాల్ మసీద్ అధ్యక్షులు షేక్ జిలాని ,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్న చిప్పాడ వెంకన్న చలమాల శ్రీనివాస్ కర్పూరం గుప్తా ఓరుగంటి నాగేంద్ర కుక్కల ధర్మరాజు , మళ్ళీడి బాబీ,తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వరప్రసాద్కు ఉగాది నంది పురస్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలుగు భాషోపాధ్యాయులు ఏపీ స్క్రిప్ట్ పాఠ్యపుస్తక రచయిత, కవి,రచయిత డాక్టర్ పూటుకూరి వరప్రసాద్ను ఉగాదిని పురస్కరించుకుని రాజమండ్రి పట్టణంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి రెడ్డి చేతులమీదుగా ఆయన నంది పురస్కారం అందుకున్నారు. వరప్రసాద్కు నంది అవార్డు పురస్కారం రావడంతో కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఆయనను తోటి ఉపాధ్యాయులు, అధికారులు, పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దృశ్యకళల అకాడమీ చైర్పర్సన్ కుడుపూడి సత్య శైలజ,శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డా.కత్తిమండ ప్రతాప్,ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజ యోనా,ఇతర సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రావ్యశ్రీకి ఇంటర్లో 990 మార్కులు

విశాలాంధ్ర-వీరవాసరం: శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని రాయకుదురుకి చెందిన అద్దాల శ్రావ్య శ్రీ 990 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించింది. భీమవరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ఆమెకు అత్యధిక మార్కులు సాధించడం పట్ల మండల ప్రజలు అభినందిస్తున్నారు .అద్దాల శ్రావ్య శ్రీ తండ్రి అద్దాల ప్రసాద్ పాలకొల్లు మండలం ఉల్లంపర్రు ఐటిఐలో ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. ఇంజనీర్ కావాలన్నదే తన కల అని శ్రావ్యశ్రీ తెలిపారు.

జిల్లాలో 5,022 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో ఇంతవరకు 5, 022 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కె .మంజు భార్గవి తెలిపారు. రబీ ధాన్యం కనీస మద్దతు ధరకు కొనుగోలు లో భాగంగా శుక్రవారం వరకు 2751.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, శనివారం 2271.12 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మొత్తం మీద ఇంతవరకు 34 రైతు భరోసా కేంద్రాల ద్వారా 411 మంది రైతుల నుంచి రూ.10.65 కోట్ల విలువైన 5,022.76 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

అర్హులైన పేదలకు 3 సెంట్లు భూమి

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. పాలకొల్లు పట్టణంలోని గాంధీ బొమ్మలు దగ్గర నుండి, యడ్ల బజార్ వరకు విస్తృత ప్రచారం చేశారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పాలకొల్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదవారికి మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్యాస్ బండ నిమిత్తం ప్రతినెల రూ.500 ఇవ్వడం జరుగుతుందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే ఇది సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యడ్ల శివాజీ, వినుకొండ బాలాజీ, చైతన్య రత్నం, డాక్టర్ బాలాజీ, రెడ్డి బాలాజీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఓటు అవగాహన కార్యక్రమం శనివారం మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ఆదేశాల మేరకు పలు పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో బి. అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదాంతపురం, రామానుజపురం, నరసన్న పాలెం, సీతంపేట, సరిపెల్లి, బయ్యనగూడెం గ్రామాలలో కళాకారులు ఓటు హక్కు ఉన్న విలువను ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడు దానిని వినియోగించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు.

నిరుత్సాహ పరిచిన ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాలు

విశాలాంధ్ర - సీతానగరం : నిరుత్సాహ పరిచిన మొదటి సంవత్సరం ఫలితాలు. మండలంలో సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో రెండవ సవంత్సరం 75 శాతం సాధించగా మొదటి సంవత్సరం 44 శాతానికి పడిపోయింది. కళాశాలలో వివిధ గ్రూపుల నుండి 107 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కాగా 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. వీరిలో సి ఈ సీ గ్రూపు నుండి ఏ క్రాంతి, జి దుర్గా రోహిత్ రెడ్డి 500 మార్కులకు గాను 414 సాధించి కళాశాల మొదటి స్థానంలో నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు నేడు పనులను చేపట్టి విలువలతో కూడిన ఉత్తమ విద్యను ప్రభుత్వ కళాశాలల్లో కూడా అందిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న సంగతి అందరికి తెలిసిందే. అయితే క్షేత్ర స్థాయిలోకి వచ్చే సరికి ఫలితాలు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. ఈ ఫలితాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే విద్యా సంవత్సరం నుండి అయినా విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, మేధావులు కోరుతున్నారు.

జోరుగా వైసీపీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - పెరవలి: పెరవలి గ్రామంలో నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు ఎన్నికల ప్రచార కార్య క్రమం శనివారం నిర్వహించారు. వైసీపీ కార్యకర్తలు నాయకులతో కలసి రాబోయే ఎన్నికలలో గన విజయంతో వైఎస్ఆర్ పార్టీని గెలిపించాలని కోరారు.

పేదలకు సంక్షేమం అందాలంటే జగన్ రావాలి

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో ఇంటింటా ప్రచారం జోరుగా సాగుతుంది. మండల జడ్పిటిసి నాయకులు వై సుబ్బారావు, మండల ఎంపీపీ శ్రీలక్ష్మీ సత్తిబాబు, వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు, డైరెక్టర్ సాదే విజయలక్ష్మి రాఘవులు సర్పంచ్ ఆశ జ్యోతి కుమార్ నాయకుల ఆధ్వర్యంలో 200 మందితో ప్రచారం చేస్తూ ఇంటింటికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి జడ్పిటిసి సుబ్బారావు వివరిస్తూ మరోసారి పేదలకు సంక్షేమం అందాలంటే జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కాకినాడ రూరల్ కన్నబాబు, పార్లమెంట్ సభ్యులు చలమలచెట్టి సునీల్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు నక్క వీరభద్రరావు, గోన శ్రీను, మేడిశెట్టి సత్తిబాబు, చిన్నారి మురళీకృష్ణ, గొర్రెల వెంకన్న, నక్క సత్తిబాబు, తుమ్మలపల్లి చంద్ర నగేష్, ముద్రగడ నానాజీ, పేకెటి గోవిందు, రాయుడు శ్రీను, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

డాల్ఫిన్ వాటర్‌లో నలకలు

విశాలాంధ్ర - నల్లజర్ల : నల్లజర్ల లో ఉన్న డాల్ఫిన్ వాటర్ ప్లాంట్‌లోని వాటర్ బాటిల్స్‌లో నలకలు ఉన్నవి, నల్లజర్ల నుండి అనేకమైన దూర సుదూర ప్రాంతాలకు కూడా ఈ వాటర్ వెళుతూ ఉంది ఆ చుట్టుపక్కల నుండి గ్రామాల్లో ప్రజలు కూడా ప్రతిదానికి కూడా ఈ వాటర్ ని ఉపయోగిస్తూ ఉంటుంటారు కానీ ఈ వాటర్ లో నలకలు కనిపించాయి. ఈ బాటిల్ నందు నలకలు ఉండడం వల్ల బాటిల్ ఓపెన్ చేయగానే అందులో కనిపించాయి . కనుక ప్రజలు ఆ వాటర్ బాటిల్ చూసి నలకలు చూసినారు బెంబేలెత్తుతున్నారు ఎంత శుభ్రమైన నీరు అని ఆ నీరును ఉపయోగిస్తున్నాము కానీ ఎంతటి నీటిలో కూడా ఇట్లాంటి నలకలు చెత్త చెదారం ఉండడం వల్ల ప్రజలు ఆరోగ్యం పట్ల భయపడుతున్నారు. ఆ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించన అధికారులు ఎప్పటికప్పుడు నీటిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిమీద అధికారులు దృష్టించాలని ప్రజానీకం తెలియజేస్తున్నవి ప్రజానీకం మీడియా ఎదుట వాపోయారు అధికారులు దీని గమనించి చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాటర్ ప్లాంట్

ఎన్నికల ప్రచారంలో దుర్గేష్ కుమార్తె

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: నిడదవోలు నియోజకవర్గం, ఉం డ్రాజవరం మండలం, సత్యవాడ గ్రామంలో శనివారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ కుమార్తె ఈలి రంగ ప్రియ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఆడపడుచులను, అన్నదమ్ములను, అవ్వతాత లను ఆప్యాయంగా పలకరిస్తూ, ఉమ్మడి పార్టీల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ ఎన్నికల గుర్తు గాజు గ్లాసుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దీంతోపాటు పార్లమెంటు అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి కి కమలం గుర్తుపై ఓటు వేయవలసిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట గ్రామ ఉపసర్పంచ్, ఎంపీటీసీ, మూడు పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాలోచితంగా జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగంలో స్పందన ఈదా ఇంటర్నే షనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఎంతో విలువైన జీవితాన్ని ఆవేశంతో అనాలోచితంగా ముగింపు పలకటం పిరికితనం అని స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా శాఖ ప్రతినిధి జాతీయ పర్యా వరణ మిత్ర తోటకూర గంగాధర్ అన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను తల్లిదండ్రులు పిల్లల పై పెంచుకున్న ఆశలు ఆశయాలకు అనాలోచితంగా ఆవేశంతో తీసుకున్న తప్పుడు నిర్ణయంతో జీవితాన్ని నాశనం చేసుకోవడం తగదని హితవు పలికారు. చిన్నపాటి సమస్యకు విలువైన జీవితాన్ని ముగించడం పరీక్షలలో తప్పినంత మాత్రం చేతనే ఆత్మహత్యలకు పాల్పడి తల్లితండ్రు లకు తీవ్ర దుఃఖాన్ని మిగల్చడం సరికాదని హితవు పలికారు. గ్రంధాలయ విభాగం అధిపతి కె అశోక్ కుమార్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా పరీక్షా తప్పినా సప్లిమెంటరీ ఉంటుందనీ, జీవితం పోతే మరొక ఛాన్స్ ఉండదనే విషయాన్ని గ్రహించాలని కోరారు. ఆత్మహత్యల వార్తలకు పత్రికలు సంయమనం పాటించి తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాస గానామృతం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో నీల కుండీల తోటలో గల రామాల యం వద్ద శనివారం లలిత పారాయణం, మహిళా భక్తులు వెంక టేశ్వర స్వామి గానామృతం కార్య క్రమం నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి జీవిత చరిత్రను పాటల రూపంలో ఆలపించారు. వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

ఇంటర్ ఫలితాల్లో అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - గోపాలపురం : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల తమ ప్రతిభను చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ టి. ఉమాదేవి. తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు76 మంది హాజరుకాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా 23 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా సాధించినట్లు ఆమె తెలిపారు.ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థిని కొరపాటి. కృష్ణవేణి ఎంపీసీ 966 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా ద్వితీయ సంవత్సరం బైపిసి విద్యార్థిని కరుటూరి. సౌమ్య 964 మార్కులు సాధించి ద్వితీయ స్థానం లో నిలిచింది. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం బైపిసి విద్యార్థిని జి. మేఘనా శ్రీ 961 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. అత్యంత ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు స్కూలు యాజమాన్యం వారిని అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 80.30శాతం ఉత్తీర్ణత, మాపాటి నిర్మల కుమారి 429 బైపిసి మొదటి సంవత్సరం విద్యార్థిని, సిరి శెట్టి స్పందన 424 ఎంపీసీలో సాధించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 23 మంది విద్యార్థులకు ఎనిమిది మంది మాత్రమే పాసయ్యారు. మొదటి సంవత్సరం 35 శాతం రెండవ సంవత్సరం 14 మంది విద్యార్థులకు 8 మంది విద్యార్థులు పాసయ్యారు 57% ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

రాబోయే ఎన్నికల్లో గెలిచేది కూటమి ప్రభుత్వమే

వరుపుల సత్యప్రభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రాబోయే ఎన్నికలలో గెలిచేది కూటమి ప్రభుత్వమే అని ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ మేరకు మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సత్య ప్రభ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నిక లలో కూటమి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో యర్రవరం గ్రామ బిజెపి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తాళ్లరేవును అగ్రపథంలో నిలుపుతా

ముమ్మిడివరం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల సుబ్బరాజు

విశాలాంధ్ర - కాకినాడ : తాళ్లరేవు మండలం అయిదేళ్లుగా వెనుకబడిన తాళ్లరేవును అభివృద్ధి పథంలో అగ్రపథంలో నిలుపుతానని ముమ్మిడివరం అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) హామీ ఇచ్చారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్లరేవులో గురువారం దాట్ల సుబ్బరాజు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని ఇంటింటా తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. ఈసందర్భంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుబ్బరాజు మాట్లాడుతూ తాళ్లరేవు మండలం అభివృద్ధిలో అన్నివిధాలా వెనుకబడిందన్నారు. ఒకప్పుడు ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మాణాలు చేపట్టామని, కానీ గడచిన అయిదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనేదే లేకుండా పోయిందని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే సంక్షేమం ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పాలకులు సంక్షేమం ముసుగులో నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి ఇచ్చినట్లే ఇచ్చి ఏవిధంగా దోచుకుంటున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మద్యపాన నిషేదం చేస్తానని నమ్మబలికి నకిలీ మద్యంను ప్రభుత్వ దుకాణాల్లోనే అధిక రేట్లకు అమ్మి పేదల ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా నడ్డి విరుస్తున్న ఈ అరాచక ముఖ్యమంత్రిని గద్దెదింపేందుకు అంతా ముందుకు కదలాలన్నారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని, అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. దాట్ల బుచ్చిబాబు తాళ్లరేవులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ప్రజలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాను గెలిచిన వెంటనే ఈసమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు సుబ్బరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలుస్తాం : పంతం నానాజీ

విశాలాంధ్ర - కాకినాడ : గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనతోలపాటు మత్స్యకార, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో అండగా నిలుస్తామని పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. కరప మండలం ఉప్పలంక, మొండి ప్రాంతాలలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు కలిసి ఇంటింటా ప్రచార కార్యక్రమం చేపట్టి గాజు గ్లాస్ గుర్తుకుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) మాట్లాడుతూ ఉప్పలంక గ్రామంలో మౌలిక సదుపాయాలు కొరవడిందని, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, స్మశానం వంటి, కనీస సౌకర్యాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, స్మశానంలో ఏర్పాట్లు చేస్తామని జనసైనికులు ముందుకు వచ్చిన వైసీపీ వాళ్ళు అడ్డుపెట్టారు అని తెలిపారు. అధికారం చేపట్టిన తర్వాత పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వైసిపి పాలనలో విసిగి చెందిన ప్రజలంతా కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. వైసీపీలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్‌లను, డైరెక్టర్‌లను నియమించారని కానీ వాటికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, కుటమి అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛను అందిస్తామన్నారు. అలాగే సబ్ ప్లాన్, బీసీల స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని గౌరవించి ప్రతి ఒక్కరూ గాజు గ్లాస్‌కు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కాకినాడ రూరల్ టీడీపీ కో- కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీబీసీఎన్సీ భూములను కాపాడండి

విశాలాంధ్ర - కాకినాడ : సిబిసిఎన్‌సికి చెందిన వేలకోట్ల ఆస్తులు కాకినాడ నడిబొడ్డిన అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో కాకినాడ పట్టణ క్రైస్తవులు, జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు శనివారం ఉదయం జిల్లా పరిషత్ సెంటర్ వద్ద ఉన్న సిబిఎం కాంపౌండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెవ జ్యోతి కుమార్ రెడ్డి, రెవ డాక్టర్ బిహెచ్‌వి మూర్తి రాజు, రెవ మేరా జేసుదాస్ మీడియాతో మాట్లాడుతూ సిబిఎం కాంపౌండ్‌లో ఉన్న పురాతన భవనాలను కూల్చి విలువైన కలపను అక్రమంగా తొలగిస్తున్నారు అన్న వార్త వెలుగులోనికి రావడంతో కలత చెంది ఈ నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ విషయమై కులమతాలకతీతంగా దేవుడు భూములు కాపాడాలని పిలుపునిచ్చారు. దైవ సేవకుల ముసుగులో దేవుడు భూములనే కబ్జా చేస్తున్న కార్పొరేటర్ సేవకులైన కల్వరి సతీష్ కుమార్‌ను, అనధికారంగా కాంపౌండ్‌లో నివసిస్తున్న రత్నకుమార్ తో పాటు మరికొందరిని సిబిఎం క్యాంపస్ నుండి వెళ్లగొట్టాలని డిమాండ్ చేశారు. మిషనరీ ఆస్తులకు ఆయనకు ఎలాంటి సంబంధం లేనిప్పటికి సిబిఎం కాంపౌండ్ లో అనధికారకంగా నివసిస్తున్న కొంతమంది తప్పుడు నిజ పత్రాలు రాసి సొంత రాజ్యాంగం సృష్టించి కాకినాడలో మసీదు, చర్చ్, దేవాదాయలకు సంపాదించిన స్థలాల పరిరక్షణ కై ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. పూర్వకాలపు బలమైన భవనాలను అనాధికారంగా కూల్చిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిబిసిఎన్‌సి సెక్రటరీ రెవ జాన్, రెవ ఎంఏపి విజయకుమార్, శీరం ఐజాక్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, వైసిపి క్రిష్టియన్ మైనార్టీ సెల్ స్టేట్ సెక్రటరీ స్టీఫెన్ ఆనంద్, వైసిపి క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు దడాల జాషువా గిరి, క్రిస్టియన్ జేఏసీ సాధనాల రాజాజీ, రిక్కీ గూటం, రెవ జోసఫ్ బెన్ని,మచ్చా బుజ్జిబాబు, కిరణ్, భాస్కర్ రాష్ట్ర, జిల్లా, స్థానిక పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, యూత్ ఫెలోషిప్ నాయకులు, దళిత నాయకులు, మైనార్టీ నాయకులు, సంఘ కాపరులు పాల్గొన్నారు.

పైడిమెట్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర- తాళ్ళ పూడి : మండలంలోని పైడి మెట్ట గ్రామానికి చెందిన నం దన ఫౌండేషన్ ఆధ్వర్యం లో తాళ్ళపూడి తహసీల్దార్ శ్రీని వాసరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన నందన ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. ఎండకాలం ముగిసే వరకు వారానికి ఒకసారి చల్లటి మజ్జిగను పంపిణీ చేస్తామని, సంస్థ ప్రతినిధి దేవరపల్లి రవి అన్నారు. కార్యక్ర మంలో పాల్గోన్న ఏ.ఎస్.ఓ జోడాల మాట్లాడుతూ వేసవి లో నిర్విరామంగా, శుభ్రమైన నీటిని అందించాలని కోరారు. కార్యక్రమం లో సభ్యులు ఆలీ, చంద్ర శేఖర్, జస్వంత్, విజయ్, కుమారి పాల్గొన్నారు.

అందుబాటులోకి ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్

విశాలాంధ్ర - కాకినాడ : భారతదేశంలోని స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ విశాఖపట్నంలో తన కిరాణా ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా తమ కార్యకలాపాలను విస్తరించిందని హెరిటేజ్ ఫుడ్స్ సీఈఓ శ్రీదీప్ కేశవన్, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్, ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ హెడ్, వైస్ ప్రెసిడెంట్ హరి కుమార్ తెలిపారు. స్థానిక వినియోగదారులకు మరుసటి రోజు కిరాణా డెలివరీలను అందిస్తోందన్నారు. ఫ్లిప్‌కార్ట్ తమ స్థానిక వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ఫ్రీడమ్ హెరిటేజ్ వంటి ప్రముఖ ప్రాంతీయ బ్రాండ్ల క్యూరేటెడ్ శ్రేణిని అందిస్తుందని, అలాగే డైరీ, గుడ్లు, చాక్లెట్లు, స్టేపుల్స్, క్లీనింగ్ ఎయిడ్స్ మరిన్ని వంటి వర్గాల నుండి 6,000 కంటే ఎక్కువ ఉత్పత్తులను అందిస్తుందన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ గమ్యస్థానాలలో విశాఖపట్నం ఒకటనీ ఆన్లైన్ కిరాణా సామాగ్రి కోసం ప్రధాన మార్కెట్ గా వెలుగొందుతుందన్నారు. ఇది విజయవాడ తర్వాత రాష్ట్రంలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రం అని చెప్పారు. ఈ కొత్త ఫుల్ ఫిల్మెంట్మె సెంటర్ దాదాపు 77,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం విజయనగరంతో పాటు విశాఖపట్నంలో రోజుకు 8,000 ఆర్డర్లను ఇది ప్రాసెస్ చేయగలదని చెప్పారు. ఈ ప్రాంతంలోని అనేక చిన్న వ్యాపారాలు, ఎంఎస్‌ఎంఈ, స్థానిక రైతుల జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా ఇది దాదాపు 1,000 ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించనుందనీ తెలిపారు.

విద్యుత్ శాఖలో ఉద్యోగిపై ఫిర్యాదులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యుత్ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ వైసిపి కార్యకర్తగా పనిచేస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వ రరావు పిర్యాదు చేశారు. ప్రభుత్వ శాఖలో ఉద్యోగం చేస్తూ వైసిపి కార్యకర్తగా షిఫ్ట్ ఆపరేటర్ గరికిపాటి రాకేష్ పనిచేస్తున్నారని, వెంటనే రాకేష్‌ను ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల డిటి శ్రీనివాసరావుకు శనివారం పిర్యాదు చేశారు. ఎపిసిపిడిసిఎల్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ వైసిపి పార్టీ సోషల్ మిడియా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్నికల కోడ్ నిబంధనలు ఉన్నప్పటికి ఫేస్ బుక్‌లో వికాస్ అన్న అభిమాని అనే పేరుతో ఖాతాని ప్రారంభించి మా నేత మండి బుద్ధప్రసాద్‌పై అసభ్య పదజాలంతో అనుచిత వాఖ్యలు చేస్తున్నాడని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఫోటోలతో సహా ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాల సుబ్రహ్మణ్యంకు అందచేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ ఎన్నికల కోడ్ సమయంలో తమ పార్టీ అధినేతపై అనుచిత వాఖ్యలు చేసిన గరికిపాటి రాకేష్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబావలి, మేడికొండ విజయ్, మోగావత్తు గోపి, కంచర్ల ఆనంద్, గుంటూరు వినయ్, లింగం బాబూరావు, కైతేపల్లి రాజేష్, చెన్ను బాబూరావు పలువురు పాల్గోన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరిగితే చర్యలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం ఎస్ఐ సత్యనారా యణ మండలంలోని దళిత నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రియల్ 14వ తేదిన అంబేద్కర్ జయంతి నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పై అధికారుల నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం అంబేద్కర్ విగ్రహాల వద్ద ఎటువంటి డీజే లకు అనుమతి లేదని, వాటిని వియోగించవద్దని వారికి తెలిపారు.అలాగే గ్రామాలలో ఎక్కడ కూడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా ఉపేక్షించేది లేదని,అలా జరగకుండా ఎవరికి వారు స్వీయ భాధ్యత వహించాలని కోరారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుడివాడ : ఈ నెల 14వ తేదిన గుడివాడలో ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్‌మోహనరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమ సిద్ధం బహిరంగ సభ, రోడుషోలను విజయవంతం చేయాలని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెండా చంద్రపాల్, జిల్లా నాయకుడు మండలి హనుమంతరావులు తెలిపారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని వైసిపి ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధ్వర్యంలో శనివారం స్థానిక నాగవరపాడు సమీపంలోని కనదుర్గమ్మ దేవస్థానం ఎదురుగల ఖాళీ స్థలంలో మధ్యాహ్ణం 3గం॥లకు జగన్‌మోహనరెడ్డి బసుయాత్రలో భాగంగా మేమంత సిధం బహిరంగ సభను నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ సభను వైసిపి కార్యకర్తలు, గృహసారధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు,

మహిళాభివృద్ధే టీడీపీ ధ్యేయం : విశ్రమ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మహిళల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టిడిపి, బిజెపి, జనసేన పార్టీల పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా సతీమణి వర్ల విశ్రమ శనివారం అన్నారు. మండలంలోని పులవర్తి గూడెంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే గా పోటీ చేస్తున్న కుమార్ రాజాను ఆదరించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా విశ్రమ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ 15,000 లు, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులో ప్రతి మహిళకు జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి నుండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ 1,500 లు తదితర సంక్షేమ పథకాలు టిడిపి అధినేత చంద్రబాబుకే సాధ్యమని విశ్రమ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మాజీ ఎంపీటీసీ కూచిపూడి జ్యోతి, చలసాని దివ్య, ఆరుమళ్ళ అనిత, చాట్ల పున్నమ్మ, పువ్వాడ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- జగనన్న పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందని, సంక్షేమ ఫలాలు వాడవాడలా అందుతున్నాయని కృష్ణాజిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులు ఉప్పాల హారిక రాము అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మండల పరిధిలోని కంచడం, బర్రిపాడు, ముంజులూరు గ్రామాలలో పెడన నియోజకవర్గ వైసిపి శసనసభ అభ్యర్థి ఉప్పాల రాము ప్రజాదీవెన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతి గడపకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారన్ని నిర్వహించారు .ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గోన్న ఉప్పాల హారిక రాము తొలుత గ్రామంలోని బి అర్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించి ఎన్నికల ప్రచారన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పాల హారిక రాము మాట్లడుతూ నిరుపేదల ఆర్థిక స్థితిగతులను మార్చడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతు ఎన్నికలలో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలివెల చిన బాబు ,జడ్పిటిసి మలిశెట్టి వెంకట రమణ, కంచడం సర్పంచి చంద్రశేఖర్,పాల్గొన్నారు.

జిల్లాలో ప్రథమ స్థానం

విశాలాంధ్ర-కూచిపూడి : 2022-24 విద్యా సంవత్సరానికి కృష్ణా, జిల్లాలలోని ప్రభుత్వ కళాశాలల పరిధిలో మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఉమ్మడి కృష్ణజిల్లాలోప్రథమ స్థానం సాధించినట్లు ఆర్ ఐ ఓ పెదపూడి రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కృష్ణాజిల్లాగతమూడు సంవత్సరాలుగా పరీక్షల ఉత్తీర్ణతాశాతంలో ప్రథమస్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించగా మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండు సంవత్సరాలుగా జిల్లాలో ప్రథమ స్థానాన్ని సాధించిందని వివరించారు. కాగాజనరల్.కోర్సులలో 91.26% ఉత్తీర్ణత సాధించిందని, గత విద్యా సంవత్సరంలో కూడా 73.2%తో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ కళాశాల ప్రధానాచార్యులు కే .ఏ. వి. ఎస్. వి .ప్రసాదశాస్త్రి పేర్కొన్నారు.ఈ ఏడాది కూడా అదే బాటలోనే పయనించడానికి విద్యా బోధనలో సహకరించి విజయం సాధించిన సహ అధ్యాపకులను అభినందించారు.

రేపటి నుండి వేటకు విరామం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 15 నుండి జూన్ 14 వ తేది వరకు చేపల వేటను నిషేదిస్తూ మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15 నుండి రాష్ట్రంలోని సముద్రంలో చేపల వేట నిషేదిస్తూ మత్స్యశాఖ అధికారులు యాంత్రిక పడవులు, మోటార్ బోట్లు ద్వారా జరిగే అన్ని రకాల చేపల వేటను 61 రోజుల పాటు నిషేదించారన్నారు. సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు రొయ్యలను సంరక్షించడం వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపదను పెంపొందించేందుకు ఈ నిషేదం విధించారన్నారు. ఈ మేరకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. నిషేద ఉత్తర్వులు ఉల్లంఘించిన బోట్ల యజమానులకు రాష్ట్ర సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని అనుసరించి శిక్ష పడుతుందన్నారు. అలాగే బోట్లు, మత్స్య సంపదను స్వాదీనం చేసుకుని జరిమానా విధిస్తారన్నారు. చేపల వేట నిషేదం సక్రమంగా అమలు అయ్యేందుకు మత్స్యశాఖ కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ, పోలీసులు, న్యావీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామని సూచించారు.

రేపు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-అవనిగడ్డ : సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.మరియాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేది మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు తుంగల సుమతీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో సకాలంలో హాజరు కావాలన్నారు. సమావేశానికి గైహాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎం.పి.టి.సి సభ్యులు, పలు శాఖల అధికారులు హాజరు కావాలని ఎం.పి.డి.ఓ చెప్పారు.

శ్రీకృష్ణునికి వెండి కిరీటం బహూకరణ

విశాలాంధ్ర-పెదపారుపూడి : శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రమైన పెదపారుపూడి చెరువుగట్టు సెంటర్లో మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆ కృష్ణ భగవానునికి స్థానిక సుప్రియ కన్స్ట్రక్షనరీ కంపెనీ అధినేత ఎండూరి రవికుమార్ తన సతీమణి గౌరీ సునీత లు వెండి కిరీటం సుమారు 60 వేల రూపాయలు తన సొంత నిధులు వెచ్చించి బహుకరణగా శనివారం శ్రీకృష్ణ భగవానునికి అందించారు. అనంతరం శివార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, సిహెచ్ రమేష్, సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ,అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలచే మండల స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, సిహెచ్ రమేష్, ఎల్ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ మరియు భక్తులు పాల్గొన్నారు.

రేపు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పై చర్చా గోష్టి

విశాలాంధ్ర-విజయవాడ: సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో 15వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పై చర్చా గోష్టిని నిర్వహిస్తున్నట్లు సంస్థ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాలలో జరుగుతున్న అభివృద్ధి పై, భవిష్యత్తు కర్తవ్యాలపై ప్రధాన వక్తలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి శాస్త్ర పూర్వ ఆచార్యులు కొండవీటి చిన్నయ సూరి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని కాంక్షించే ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ కాముకులు ఈ చర్చా గోష్టిలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

40వ వారం కొనసాగిన అన్నసంతర్పణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసైనికుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం 40 వ వారం కొనసాగింది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అవనిగడ్డ, కోడూరు రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 40 వ శనివారం కరెంట్ వీరయ్య జ్ఞాపకార్థ: మనువడు చింటు అన్నదానం చేశారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమంలో 200 మందికి పైగా నిరుపేదలకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సిలు బొప్పన బాణు, కటికల వసంత్, మాదివాడ కుటుంబరావు లతో పాటు పలువురు జనసైనికులు పాల్గోని వారి సేవలందించారు.